క్లుప్తంగా

కమనీయం.. సీతారాముల కల్యాణం



సీతారాముల గ్రామోత్సవం

మనుబోలు : శ్రీరామ నవమిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని పడమటి వీధి రామాలయంలో సీతారాముల కల్యాణాన్ని శనివారం అర్ధరాత్రి కమనీయంగా నిర్వహించారు. ముందుగా అర్చకుడు సుబ్రహ్మణ్యం శర్మ సీతారాములకు పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. విశేష పూజల చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. వేదమంత్రోచ్చారణలతో మంగళ వాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. అనంతరం నవ దంపతులను భక్తులు భుజాలపై మోస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామస్తులు సీతారాములకు కొబ్బరికాయలు, పండ్లు పూలతో మంగళ హారతులు పట్టారు.

సీతారాములకు ఏకాంత సేవ



ఏకాంత సేవలో సీతారాములు

కోదండరామపురంలోని కోదండరాముని ఆలయంలో సీతారాముల ఏకాంత సేవను శనివారం అర్ధరాత్రి వైభవంగా నిర్వహించారు. అర్చకుడు సాయిశర్మ వేదమంత్రోచ్చారణల మధ్య నవ దంపతులైన సీతారాములకు అభిషేకాలు చేసి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. తొమ్మిది రకాల పండ్లు, తొమ్మిది రకాల స్వీట్లను స్వామి దంపతులకు నైవేద్యంగా ఉంచి శాస్త్రోక్తంగా ఏకాంత సేవను నిర్వహించారు. ఉభయకర్తలుగా దువ్వూరు సుబ్బారెడ్డి, ప్రసన్న దంపతులు వ్యవహరించారు.

విద్యార్థినికి అభినందన



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పట్టణంలోని వివేకానంద పాఠశాలకు చెందిన విద్యార్థిని జేఈఈ మెయిన్స్ పరీక్షలో ఎండీ అర్షియా 99.45 పర్సంటైల్‌తో జాతీయస్థాయిలో 1239 ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా ఆదివారం అర్షియాను పాఠశాల యాజమాన్యం సత్కరించింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వడదెబ్బతో ఆటో డ్రైవర్ మృతి

మనుబోలు : తీవ్రమైన ఎండ వేడిమికి ఓ ఆటో డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని యాచవరం గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. యాచవరం గ్రామానికి చెందిన సురేష్(46) బాడుగకు ఆటో తిప్పుతూ జీవనం సాగించేవాడు. ఆటో బాడుగకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చాడు. డీహైడ్రేషన్‌తో అస్వస్థతకు గురై మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి కాకాణి ఫోన్‌లో వారి కుటుంబాన్ని పరామర్శించారు. మంచి కార్యకర్తను కోల్పోయామన్నారు. వారి కుటుంబానికి అండగా నిలుస్తానన్నారు.

అదృశ్యమైన బాలికలు సురక్షితం

నెల్లూరు(క్రైమ్): బాలసదన్ నుంచి అదృశ్యమైన ఇద్దరు బాలికలు జొన్నవాడలో సురక్షితంగా ఉన్నారు. వివరాలు..జలదంకి, మరుపూరు గ్రామాలకు చెందిన ఇద్దరు బాలికలు రెవెన్యూ కాలనీలోని బాలసదన్‌లో గత కొంతకాలంగా ఉంటున్నారు. ఈ నెల 25న తెల్లవారుజామున బాలసదన్ నుంచి వారు అదృశ్యమయ్యారు. అక్కడి సిబ్బంది ఫిర్యాదు మేరకు దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. ఐసీపీఎస్, దర్గామిట్ట పోలీసులు సంయుక్తంగా బాలికల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం జొన్నవాడలో బాలికలను గుర్తించి బాలసదన్‌కు అప్పగించారు.

ముగిసిన వేణుగోపాలుడి బ్రహ్మోత్సవాలు

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు ఉదయం బ్రహ్మోత్సవాలతో అలిసిపోయిన వేణుగోపాలుడికి చక్ర స్నానాన్ని నిర్వహించారు. రాత్రి రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాలుడ్ని విశేషంగా అలంకరించి ఏకాంతసేవను వేడుకగా నిర్వహించారు. చక్రస్నానానికి విరుపావరుపుల గిరికృష్ణ, సంయుక్త దంపతులు, ఏకాంత సేవకు సన్నపురెడ్డి సుకన్య, సన్నపురెడ్డి సుధాకర్‌రెడ్డి, సుమన వ్యవహరించారు. ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త, ధర్మకర్తల మండలి చైర్మన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, ఈఓ గిరికృష్ణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మనుబోలులో ప్రగతి పుంతలు

• మారిన గ్రామ రూపురేఖలు

మనుబోలు : దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని గ్రామాలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక ప్రగతి పుంతలు తొక్కాయి. ఊరూరా సీసీరోడ్లు, సైడు డ్రెయిన్లు, సచివాలయ భవనాలు, ఆర్బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు నిర్మాణమయ్యాయి. నవరత్నాల పేరుతో వివిధ వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. రాజకీయ పార్టీల ప్రమేయం, వివక్షకు తావు లేకుండా వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా పారదర్శకంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తుండడంతో అర్హులందరికీ పథకాలు అందుతున్నాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి గ్రామాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కారానికి బాటలు వేశారు. ఇందుకోసం ప్రభుత్వం ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేసింది.

లబ్ధిదారుల ఖాతాలో సంక్షేమ ఫలాలు

మనుబోలు బిట్–2 సచివాలయ పరిధిలో వివిధ సంక్షేమ పథకాల రూపంలో డీబీటీ(డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) ద్వారా రూ.18.63 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. అమ్మఒడి, వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ సున్నావడ్డీ, వైఎస్సార్ పెన్షన్ కానుక, వైఎస్సార్ మత్స్యకార భరోసా, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ కాపు నేస్తం, వైఎస్సార్ నేతన్న నేస్తం, హౌసింగ్‌కు చెల్లింపులు, జగనన్న చేదోడు తదితర 33 పథకాల ద్వారా ఈ నగదు జమ చేశారు.



మనుబోలు సచివాలయం



నిర్మాణంలో ఉన్న పీహెచ్‌సీ భవనం

సమస్యల పరిష్కారం

కేవలం సంక్షేమ పథకాలకే పరిమితం కాకుండా అభివృద్ధి పనులకు కూడా ప్రభుత్వం సముచిత ప్రాధాన్యం ఇచ్చింది. మనుబోలు పంచాయతీ పరిధిలో సుమారు రూ.20 కోట్లతో సీసీరోడ్లు, మురుగు కాలువలు, సచివాలయం, ఆర్బీకే, షాదీమంజిల్, తదితర నిర్మాణం చేపట్టారు. రూ.1.24 కోట్లతో పీహెచ్‌సీ భవనం నిర్మాణ దశలో ఉంది. ఇవే కాకుండా లక్షలాది రూపాయలు వెచ్చించి 11 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటు, మనుబోలు నుంచి పశువులు పొలాలకు వెళ్లేందుకు హైవే కింద నుంచి డొంక ఏర్పాటు చేశారు.



పూర్తయిన సీసీరోడ్డు, సైడు డ్రెయిన్

మనుబోలు బిట్-2 సచివాలయ పరిధిలో..
డీబీటీ ద్వారా జరిగిన లబ్ధి రూ.18,63,04,724
నాన్ డీబీటీ ద్వారా జరిగిన లబ్ధి రూ.10,63,04,304
మొత్తం: రూ.29,26,09,028
అభివృద్ధి పనులకు వెచ్చించిన మొత్తం సుమారు రూ.20 కోట్లు



జగనన్న లేఅవుట్‌లో పూర్తయిన ఇల్లు

సొంతింటి కల నెరవేరింది



ఎన్నో ఏళ్లుగా అద్దె ఇంట్లో ఉంటున్నాం. చాలీచాలని సంపాదనతో ఇంటి అద్దెలు కట్టలేక ఇబ్బందులు పడేవాళ్లం. సొంతిల్లు లేక ఇబ్బందులు పడుతున్నా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న లేఅవుట్‌లో స్థలం కేటాయించడంతో పాటు ఇంటి నిర్మాణం కోసం వివిధ దశల్లో రూ.1.80 లక్షలు ఇచ్చారు. సొంతింటి కల నెరవేరింది.

\- పారి అనిత, లబ్ధిదారు

ప్రతివీధిలో సీసీరోడ్లు



మనుబోలు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు జరిగాయి. ప్రతివీధిలో సీసీ రోడ్లు వేశారు. సైడు డ్రెయిన్లు నిర్మించాం. సచివాలయం, ఆర్బీకే, షాదీ మంజిల్ భవనాలు పూర్తయ్యాయి. ఆధునిక వసతులతో ఆస్పత్రి నిర్మాణమవుతోంది.

\- కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, ఉపసర్పంచ్

పేదలకు అన్ని ఇస్తున్నారు



ఈ ప్రభుత్వంలో మాకు అన్నిరకాలుగా మేలు జరిగింది. మా కాలనీలో తాగునీటి సమస్యలు లేకుండా పంచాయతీ నీటి సరఫరాతో పాటు తాగునీటి కోసం వాటర్ ప్లాంటు ఏర్పాటు చేశారు.

\- జి.సుబ్బమ్మ, అరుంధతీవాడ

వైఎస్సార్‌సీపీలో చేరికలు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే ప్రసన్న

కోవూరు : బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన టీడీపీ నేత సుల్తాన్ ఆధ్వర్యంలో 50 మంది ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. కోవూరులోని పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి అతిథి గృహంలో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పారు. అలాగే కోవూరు కోనేటికయ్యలుకు చెందిన పలువురు టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీలో చేరారు.

ఓటు హక్కుపై వాకర్స్‌కు అవగాహన



అవగాహన కల్పిస్తున్న స్వీప్ సభ్యులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పట్టణంలోని డీఎల్ఎన్నార్ ఉన్నత పాఠశాల ఆవరణలో స్వీప్ ఆధ్వర్యంలో ఆదివారం వాకర్స్‌కు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోవూరు నియోజకవర్గ స్వీప్ నోడల్ ఆఫీసర్ వెంకటరత్నం మాట్లాడుతూ ఓటర్లు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు వేయాలని పేర్కొన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో చదువుకున్న యువకులు మిగతా వారికి ఓటుహక్కుపై అవగాహన కల్పించాలన్నారు. అవినీతిరహిత ప్రభుత్వం, మంచి పరిపాలన కావాలంటే ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో స్వీప్ సభ్యులు రవిశంకర్‌రెడ్డి, మల్లీశ్వర్‌రెడ్డి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దు



విశేషంగా తరలివచ్చిన జన సమూహం మధ్య సాగుతున్న ప్రసన్న ప్రచారం

• ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు : ఎన్నికల వేళ కనిపించే ప్రతిపక్ష నాయకుల మాటలు నమ్మవద్దని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కోరారు. మండలంలోని పడుగుపాడులో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయ సహకారాలతో కోవూరు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టించామని తెలిపారు. వెంకటేశ్వరపురం నుంచి పడుగుపాడు హైవే రోడ్డును రూ.63 కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. ఇలా కోవూరు నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలియజేశారు. టీడీపీ కోవూరు అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి వైఎస్సార్‌సీపీకి వెన్నుపోటు పొడిచారని, ఆమెను ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదన్నారు. జగన్ మాట ఇస్తే తప్పరని, ఆయనకు మరోసారి పట్టం కట్టేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. తొలుత పడుగుపాడులో ఎమ్మెల్యే ప్రసన్నకు ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దినేష్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, సర్పంచ్ నారాయణ, ఉపసర్పంచ్ అహ్మద్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాం.. ఆదరించండి

• రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు : ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారు, మరోసారి ఆయన్ను ఆదరించండి అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రజలను అభ్యర్థించారు. మండలంలోని వరకవిపూడి, మల్లికార్జునపురం పంచాయతీల్లో ఆదివారం సాయంత్రం ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. ముందుగా వరకవిపూడిలో మంత్రికి పార్టీ జిల్లా కార్యదర్శి ఇసనాక రమేష్‌రెడ్డి, మండలాధ్యక్షుడు ఉప్పల శంకరయ్యగౌడ్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో చంద్రబాబు 607 హామీలిచ్చి ఆరు హామీలను కూడా అమలు చేయలేదన్నారు. అయితే 2019 ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని వైఎస్ జగన్ నెరవేర్చినట్లు తెలియజేశారు. చెప్పి ఎగ్గొట్టే చంద్రబాబు కావాలో, చెప్పింది చేసే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావాలో రాష్ట్ర ప్రజలే నిర్ణయించుకోవాలన్నారు. గతంలో లాటరీ ద్వారా ఎంపిక చేసి సీసీరోడ్లను వేస్తే, నేడు ఎక్కడా మట్టిరోడ్డు లేకుండా సీసీరోడ్లు వేసినట్లు పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావడం ఖాయమన్నారు. సర్వేపల్లి నియోజకవర్గానికి సంబంధించి తన శక్తి మేర అభివృద్ధి చేసి చూపినట్లు మంత్రి కాకాణి చెప్పుకొచ్చారు. కరోనా కష్టకాలంలో రూ.3 కోట్లతో బియ్యం, కూరగాయలు అందించి నియోజకవర్గ ప్రజలను అండగా నిలిచానని, తనకు మరో అవకాశం కల్పించాలని కోరారు. ఎన్నికల సమయంలో మాత్రమే వచ్చే సోమిరెడ్డిని నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసులురెడ్డి, గోడా రాఘయ్య, మహేష్, గోడా మహేష్, తాండ్ర శీనయ్య, ఈదూరు ఏడుకొండలు, తాళ్లూరు రాఘవ్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి కాకాణికి ఘన స్వాగతం పలుకుతున్న వరకవిపూడి వాసులు

హైవేపై ముమ్మరంగా తనిఖీలు

మనుబోలు : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మండల పరిధిలోని జాతీయ రహదారి, ఇతర రహదారి మార్గాల్లో అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ప్రేమలత జాతీయ రహదారిపై పొదలకూరు క్రాస్‌రోడ్డు వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు నగదు, వస్తువులను పెద్ద ఎత్తున అక్రమంగా తరలిస్తుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రూ.50 వేలకు మించి నగదు, అధిక సంఖ్యలో వస్తువులు ఉంటే వాటికి సంబంధించి బిల్లులు చూపాల్సి ఉంటుందన్నారు. ఆమె వెంట కానిస్టేబుల్ రాజారామ్ ఉన్నారు.



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిణి

మంత్రి కాకాణి ఎన్నికల ప్రచారం నేడు

ముత్తుకూరు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండల పరిధిలో సోమవారం ఎన్నికల ప్రచారం చేస్తారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం వెల్లడించారు. ఉదయం పొట్టెంపాడు పంచాయతీలో, సాయంత్రం బ్రహ్మదేవి పంచాయతీలో ప్రచారం చేస్తారని, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాల్సిందిగా కోరారు.

177 మద్యం బాటిళ్ల స్వాధీనం



ఇందుకూరుపేట : మండలంలోని మైపాడులో 177 మద్యం బాటిళ్లను ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ ఎస్.శ్రీనివాసులు తెలిపారు. మైపాడు పడమటిపాళేనికి చెందిన పెద తాతయ్య అనే వ్యక్తి ఇంటి ఆవరణలో మద్యం బాటిళ్లు ఉండడంతో దాడులు నిర్వహించామని, నిందితుడిని అదుపులోకి తీసుకుని మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేశామని, వీటి విలువ రూ.27 వేల వరకు ఉంటుందని సీఐ వివరించారు.

సోమిరెడ్డి పతనం ఖాయం



తోటపల్లిగూడూరు : వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మంత్రి కాకాణి

• రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు : సర్వేపల్లి టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పతనం ఖాయమైందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కోడూరు పంచాయతీకి చెందిన 30 టీడీపీ కుటుంబాలు ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. నెల్లూరులోని మంత్రి కాకాణి క్యాంపు కార్యాలయంలో ఈ మేరకు వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. మంత్రి కాకాణి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో రోజురోజుకు వైఎస్సార్‌సీపీలోకి వలసలు పెరిగిపోతున్నాయన్నారు. ముఖ్యంగా సర్వేపల్లి నియోజకవర్గంలో టీడీపీ వలసలు అధికమవుతుండడంతో ఆ పార్టీ దాదాపు కనుమరుగయ్యే స్థితికి చేరుకుందన్నారు. టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వస్తున్న నాయకులు, కార్యకర్తలకు సముచిత స్థానం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తోటపల్లిగూడూరు సొసైటీ చైర్మన్ కావల్‌రెడ్డి హరిశ్చంద్రారెడ్డి, నాయకులు కావల్‌రెడ్డి నరేంద్రరెడ్డి, విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ముత్తుకూరు : వైఎస్సార్‌సీపీలో చేరిన రామ్‌ప్రసాద్‌రెడ్డి

మాజీ ఎమ్మెల్యే సోదరుడి చేరిక

ముత్తుకూరు : సర్వేపల్లి మాజీ ఎమ్మెల్యే ఈదూరు రామకృష్ణారెడ్డి సోదరుడు ఈదూరు రామ్‌ప్రసాద్‌రెడ్డి ఆదివారం మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఈ మేరకు రామ్‌ప్రసాద్‌రెడ్డికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ముత్తుకూరు మండలంలో గట్టిపట్టున్న నాయకుడిగా రామ్‌ప్రసాద్‌రెడ్డికి పేరుంది. ఈయన చేరికతో తెలుగుదేశం పార్టీకి భారీ షాక్ తగిలినట్లు అయ్యింది.

అభివృద్ధిని చూసి అండగా నిలవాలి

వెంకటాచలం : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని చూసి మరోసారి అండగా నిలవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె కాకాణి పూజిత కోరారు. మండలంలోని కసుమూరు, కురిచెర్లపాడు గ్రామాల్లో ఆమె ఆదివారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రతి కాలనీకి వెళ్లి ప్రజలతో మమేకమై సంక్షేమ పథకాలు ఎలా అందాయని అడిగి తెలుసుకున్నారు. జగనన్న పాలనలో అందిన సంక్షేమ పథకాలతో తాము చాలా సంతోషంగా జీవిస్తున్నామని పలువురు మహిళలు చెప్పారు. అనంతరం కాకాణి పూజిత విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయలేని అభివృద్ధి వైఎస్సార్‌సీపీ పాలనలో మంత్రి కాకాణి చేసి చూపినట్లు తెలియజేశారు. ప్రజలు టీడీపీ పాలనకు, వైఎస్సార్‌సీపీ పాలనకు మధ్య వ్యత్యాసాన్ని గుర్తించి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



వెంకటాచలం : కురిచెర్లపాడులో ఎన్నికల ప్రచారం చేస్తున్న పూజిత

ఎమ్మార్వో కాలనీలో..

పొదలకూరు : పట్టణంలోని ఎమ్మార్వో కాలనీలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బావ దేవిరెడ్డి రాఘవరెడ్డి, వాకాటి ద్వారకానాథ్‌రెడ్డి ప్రచారంలో పాల్గొని అభివృద్ధిని చూసి ఓటేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. వారి వెంట జెడ్పీటీసీ నిర్మలమ్మ, ఎంపీటీసీ జి.లక్ష్మీకల్యాణి, సర్పంచ్ చిట్టెమ్మ, ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, నాయకులు ఎం.శేఖర్‌బాబు, జి.వేణుగోపాల్‌రెడ్డి, ఎం.సతీష్‌రెడ్డి, ఎస్‌కే అంజాద్, ఎం.శివశంకర్, హరి, భాస్కర్, సోమా భాస్కర్, రాజగోపాల్‌రెడ్డి, వేమారెడ్డి, ఎం.రవికుమార్, బాలకృష్ణ, వాకాటి శివారెడ్డి, కె.మస్తానయ్య, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పొదలకూరు : ఎన్నికల ప్రచారం చేస్తున్న నాయకులు

ప్రజా నాయకులను ఎన్నుకోవాలి

కొడవలూరు : నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండే నాయకులను గెలిపించుకుంటే ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించుకునే వీలుంటుందని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు తెలిపారు. మండలంలోని నార్తురాజుపాళెం దళితవాడలో ఇంటింటి ప్రచారాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో డబ్బుతో ఓట్లకు ఎర వేసే నేతలు ఎన్నికల అనంతరం కనిపించకుండా పోతారని టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను ఉద్దేశించి విమర్శించారు. వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో జనరంజకంగా ఉందన్నారు. రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా పని చేసే జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుంటే అన్ని వర్గాల వారు సంతోషంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గాలి జ్యోతి, సర్పంచ్ బి.సుప్రియ, ఎంపీటీసీ పి.అనీల్‌కుమార్‌రెడ్డి, నాయకులు పి.మధుసూదన్‌రెడ్డి, ఎస్.మాణిక్యరావు, ఎండీ.కరిముల్లా, నారపరెడ్డి, పి.రవి, కె.శ్రీనివాసులు, కె.ప్రేమ్‌కుమార్, సుబ్బయ్య, జి.సునీల్ పాల్గొన్నారు.

ముంగటకే సంక్షేమ పథకాలు

ఇందుకూరుపేట : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముంగిటకే సంక్షేమ పథకాలు అందుతున్నట్లు ఆ పార్టీ కోవూరు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆయన సోదరుడు నల్లపరెడ్డి రాహిన్‌రెడ్డితో కలిసి మండలంలోని పాములవారిపాళెం గ్రామంలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రం మరింత ముందుకు సాగాలంటే జనరంజక పాలన అవసరమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గొల్లపల్లి విజయ్‌కుమార్, మావులూరు శ్రీనివాసులురెడ్డి, భీమవరపు వెంకటకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొడవలూరు : నార్తురాజుపాళెం దళితవాడలో కరపత్రం అందజేస్తున్న చలపతిరావు